పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబీకులు

మృత్యుహేల

మహాత్మా జ్యోతిబా ఫూలే పాఠశాలలో విద్యార్థి మృతి

- మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పాఠశాల వద్ద ఆందోళన
- అనారోగ్యంతో మృతి చెందినట్లు కేసు నమోదు
- విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తానన్న ఆర్డీవో, డీఈవో
- ఘటనకు కారణమైన ప్రిన్సిపాల్‌సహా నలుగురు సస్పెండ్
- రూ.2 లక్షల పరిహారం, ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం

షేక్ ఆయాన్ (ఫైల్)

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, డీఈవో

మీడియాతో మాట్లాడుతున్న గురుకులాల డిప్యూటీ సెక్రటరీ తిరుపతి

నిర్మల్ అర్బన్, నవంబర్ 5 ః నిర్మల్ పట్టణంలోని ఎంజేపీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న షేక్ ఆయాన్ హుస్సేన్(14) మంగళవారం మృతి చెందాడు. దిలావర్‌పూర్ మండలంలోని లోలం గ్రామానికి చెందిన నాసర్-షరీఫ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా.. పెద్ద కుమారుడు ఆయాన్ హుస్సేన్. ఈయన తండ్రి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండగా.. తల్లి బీడీ కార్మికురాలు. పాఠశాల విద్యార్థులు తెలిపిన సమాచారం మేరకు.. మంగళవారం తెల్లవారు జామున తోటి విద్యార్థులతో కలిసి ఆయాన్ హుస్సేన్ ఆడుకునేందుకు గ్రౌండ్‌కు వెళ్లాడు. తనకు వణుకు పుడుతుందని పీఈటీకి సమాచారం అందించాడు. వెంటనే మెడికల్ రూంలోకి తీసుకెళ్లారు. పిట్స్ రావడంతో వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయాన్ హుస్సేన్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఆయాన్ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు ఆసుపత్రికి చేరుకున్నారు. కొడుకు మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని కన్నీటి పర్యంతం అయ్యారు. తోటి విద్యార్థులతో ఆడుతూ పాడుతూ ఉండే తమ కుమారుడు ఒక్కసారిగా మృతి చెందిన విషయాన్ని జీర్ణించుకోలేక పోయారు. తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పాఠశాల వద్ద ఆందోళన..

ఆయాన్ హుస్సేన్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. నిన్నటి వరకు అనారోగ్యంగా ఉన్న తమ కుమారుడు మృతి చెందడంపై అనుమానాలు ఉన్నాయని వాటిని తీర్చాలని ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, పోలీసులు ఆందోళనను సర్దుమనిగేలా చేశారు. అలాగే విద్యార్థి మృతికి కారణమైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుని ఏబీవీపీ నాయకులు నిరసన చేపట్టారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని, కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించాలని పేర్కొన్నారు. అలాగే పాఠశాలలో పలు సమస్యలు ఉన్నాయని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తా : ఆర్డీవో

పాఠశాలలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆర్డీవో రత్న కల్యాణి అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఈమెతోపాటు డీఈవో రవీందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ పాఠశాలకు చేరుకుని మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మాట్లాడారు. పాఠశాల అద్దె భవనంలో ఉండడంతో బాత్‌రూంలు సరిగ్గా లేవని ఆటలాడేందుకు గ్రౌండ్ లేదని, ఇరుకైన గదులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మౌలిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఐదుగురు సస్పెన్షన్

నిర్మల్ పట్టణంలోని ఎంజేపీలో విద్యార్థి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గురుకులాల డిప్యూటీ సెక్రటరీ తిరుపతి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ ఘటనలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన కారణంగా ఐదుగురిని పాఠశాల ప్రిన్సిపల్ సెక్రటరీ సస్పెండ్ చేశారు. ఇందులో పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్, నైట్ వాచ్‌మన్ అరుణ్, నైట్ కేర్ టేకర్ రమేశ్, స్టాఫ్ నర్సు సుజాతతోపాటు పీఈటీ పెంటన్నను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతోపాటు ఆర్‌సీవో గోపీచంద్‌పై చర్యలు తీసుకోవాలని ప్రతిపాదనలను పంపిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి మృతికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన సంతాపాన్ని తెలిపారు. విద్యార్థి కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఓటును నమోదు చేసుకోవాలి

న్యాయవాదులతో మాట్లాడుతున్న అల్పోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

భైంసా, నవంబర్ 5 : ఓటును నమోదు చేసుకోవడానికి బుధవారం చివరి తేదీ అని, ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని అల్పోర్స్ డైరెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ఎన్ఆర్ గార్డెన్, బార్ అసోసియేషన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే కేజీబీవీ, మోడల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా జీతాలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. యువ న్యాయవాదులకు రూ.ఐదు వేల గౌరవ వేతనం కోసం కృషి చేస్తానన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్ల హెల్త్ కార్డుల మంజూరు కోసం కృషి చేస్తానన్నారు. పీఆర్‌టీయూ నాయకులు రమణరావు, వినోద్, గంగాధర్ పాల్గొన్నారు.

సర్వేకు సిద్ధం

నేటి నుంచి ప్రారంభం.. పక్షం రోజుల్లో పూర్తి..

సారంగాపూర్ మండలం చించోలి(బి)లో సర్వే సన్నద్ధతను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్ (ఫైల్)

- మొదటి మూడు రోజులు కుటుంబాల గుర్తింపు
- ఆ తర్వాత ఇంటింటా సర్వే
- ప్రభుత్వ ఉద్యోగులతో పక్కాగా నిర్వహణ
- సర్వే పూర్తయిన ప్రతి ఇంటికీ స్టిక్కర్

2011 జనాభా లెక్కల ప్రకారం..

ఇండ్లు(అంచనా)	2,69,384
ఎన్యూమరేటర్లు	1796
సూపర్ వైజర్లు	179

నిర్మల్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో నేటి(బుధవారం) నుంచి ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. సర్వే నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఈ సర్వేలో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బందితోపాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న వారిని పూర్తి స్థాయిలో భాగస్వాములను చేయనున్నారు. అత్యవసర శాఖలను మినహాయించి, మిగతా అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందిని సర్వే కోసం వినియోగించుకోవాలని తాజాగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 2,24,487 ఇండ్లు ఉండగా, ప్రస్తుత లెక్కల ప్రకారం 20 శాతం అదనంగా 2,69,384 ఇండ్లు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఆయా ఇండ్లను సర్వే చేసేందుకు 1,796 మంది ఎన్యూమరేటర్లు, 179 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ప్రతి 150 ఇండ్లకు ఒక ఎన్యూమరేషన్ బ్లాకుగా ఏర్పాటు చేసి దానికి ఒక ఎన్యూమరేటర్‌ను కేటాయించారు. అలాగే సమాచార సేకరణ, పర్యవేక్షణ బాధ్యతలను సూపర్‌వైజర్లు నిర్వర్తిస్తారు. ఎన్యూమరేటర్లు నిర్వహించిన సర్వే వివరాలను సూపర్‌వైజర్లు ర్యాండమ్‌గా తనిఖీ చేసి ఏవైనా లోటుపాట్లు ఉంటే ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి వాటిని సరి చేస్తారు. అయితే ఈ సర్వేలో ప్రధాన, ఉప ప్రశ్నలతో కలిపి మొత్తం 75 అంశాలకు సంబంధించిన వివరాలను సేకరించనున్నారు. సేకరించిన కుటుంబాల వివరాలను మండల స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయనుండడంతో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారు, ఇంకా మిగిలిన అర్హుల వివరాల లెక్క తేలనున్నది. ప్రభుత్వ పరంగా చేపట్టే కార్యక్రమాలకు ఈ సర్వే కీలకం కాబోతున్నది. కాగా.. ఈ సర్వేను ఈ నెల 6 నుంచి ప్రారంభించి పక్షం రోజుల్లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సమగ్ర సర్వే పూర్తి చేసిన ప్రతి ఇంటికి స్టిక్కర్లు అతికించనున్నారు.

8 పేజీలు.. 56 అంశాలు..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేలో కుటుంబ సభ్యులకు సంబంధించిన సర్వం వివరాలు నమోదు కానున్నాయి. ఇందుకోసం 8 పేజీలతో కూడిన ఫార్మాట్‌లో 56 అంశాలకు సంబంధించిన వివరాలను సేకరించాల్సి ఉన్నది. వాటి ఆధారంగా ఇంటి యజమాని నుంచి పూర్తి వివరాలు తీసుకోనున్నారు. 2011లో జనగణన, 2014లో కేసీఆర్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే జరుపగా మళ్లీ పదేండ్ల తర్వాత ప్రస్తుత ప్రభుత్వం ఇంటింటి సర్వే చేయతలపెట్టింది. ఒక వంటగదిని ఆధారంగా చేసుకుని దాని పరిధిలో నివసిస్తున్న కుటుంబ సభ్యులందరినీ కలిపి ఒక కుటుంబంగా గుర్తించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇలా జిల్లాలో ఉన్న మొత్తం ఇండ్లను ఈ నెల 6,7,8వ తేదీల్లో గుర్తిస్తారు. ఆ తర్వాత 9వ తేదీ నుంచి ఎన్యూమరేటర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి సర్వే మొదలు పెడతారు. ఈ సర్వేలో కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల వివరాలు, కులం, వయస్సు, భాష, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, దివ్యాంగులు, వివాహితుల వివరాలు, విద్యార్హతలు, బడి మానేస్తే ఎప్పుడు మానేశారో కూడా తెలుసుకుంటారు. చేస్తున్న ఉద్యోగం, ఉపాధి, వృత్తి, వ్యాపార వివరాలతోపాటు వార్షిక ఆదాయం, రోజూవారీ వేతన వివరాలు, కార్మికులయితే ఏ రంగంలో పని చేస్తున్నారనేది తీసుకుంటారు. కులవృత్తులైతే ఆ వివరాలను నోట్ చేస్తారు. కులవృత్తి కారణంగా కలిగిన వ్యాధుల వివరాలు కూడా సేకరించనున్నారు. వార్షిక ఆదాయం, ఆస్తులు, బ్యాంకు రుణాలను కూడా ఈ ఫార్మాట్‌లో నమోదు చేయనున్నారు. ఆదాయపన్ను చెల్లింపుదారులా? బ్యాంకు ఖాతాలు ఎన్ని ఉన్నాయి? మొదలగు వివరాలు తెలుసుకుంటారు. పంట భూములు, వాటికి సాగునీటి వసతి ఉన్నదా? ధరణి పాస్‌బుక్ నంబర్, ఒకవేళ భూమి కౌలు చేస్తున్నట్లైతే సాగు విస్తీర్ణం వివరాలు తీసుకుంటారు. అంతేకాకుండా రిజర్వేషన్ విధానం ద్వారా పొందిన విద్య, ఉద్యోగ ప్రయోజనాలు, ఐదేళ్లుగా లబ్ధి పొందిన పథకాల పేర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారైతే కుల ధృవీకరణ పత్రం పొందారా లేదా అనే వివరాలు తెలపాల్సి ఉంటుంది. ఇలాంటి అనేక అంశాలతో పాటు చివరగా రాజకీయ నేపథ్యం గురించి కూడా ఈ సర్వేలో సేకరించనుండటం గమనార్హం.

❖ సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం వచ్చే అధికారులకు ప్రజలు పూర్తిగా సహకరించాలి. రేషన్‌కార్డు, ఆధార్ కార్డుతో పాటు పూర్తి కుటుంబ వివరాలను అధికారులకు తెలియజేయాలి. అప్పుడే ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి వివరాలు నమోదు చేయబడుతాయి. కుటుంబ వివరాలు తెలియజేయడం వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు యథావిధిగా లబ్ధిదారులకు అందుతాయి. ఎన్యూమరేటర్లు నిర్వహించిన సర్వే వివరాలను ఏ రోజుకారోజు మండలాల వారీగా అధికారుల పర్యవేక్షణలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ సర్వే ద్వారా జిల్లాలోని ఇండ్లు, జనాభా, ఇతర వివరాలన్నీ స్పష్టంగా తెలిసిపోతాయి.

- అభిలాష అభినవ్, జిల్లా కలెక్టర్, నిర్మల్

జెండాకు సెల్యూట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జ్యోతి వెలిగిస్తున్న నాయకులు

ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న క్రీడాకారులు

అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

మరోసారి పులి దాడి

- ఆవు మెడ, కాలిపై గాయం
- పశువుల కాపరులకు కనిపించిన టైగర్
- పులికి హాని తలపెట్ట వద్దు : అటవీ శాఖ

అడవిలో గుర్తించిన పులి పాదముద్రలు

కుంటాల, నవంబర్ 5 : కుంటాల మండలంలోని అంబుగాంకు చెందిన పశువుల కాపరులు మారుతితోపాటు మరో ఇద్దరు అడవిలో పశువుల మందను పెడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం పెద్దపులి మందలోని ఆవు మెడ, కాలుపై దాడి చేసి గాయపర్చింది. అదే సమయంలో రాథోడ్ వినోద్‌కు చెందిన ఆవు అడవిలో తప్పిపోయింది. మంగళవారం మరోసారి కూడా అదే పశువుల కాపరి మారుతికి అడవిలో పులి కనిపించినట్టు తెలిపాడు. ఎఫ్ఎస్‌వోలు పూర్ణిమ, కీర్తి, లక్ష్మణ్, ఎఫ్‌బీవో లు హరిలత, కృష్ణ, మహేశ్, రాజేశ్ బృందాలుగా ఏర్పడి పులి గమనాన్ని ట్రాక్ చేస్తున్నారు. కాగా.. మంగళవారం నిర్మల్ డీఎఫ్‌వో నాగిని భాను మండలంలోని అటవీ ప్రాంత పరిసరాల్లో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువుల కాపర్లు అడవిలోకి వెళ్లకుండా ఉండాలని, చేలలో అమర్చిన విద్యుత్ కంచెలను తొలగించాలని కోరారు. పులికి హానీ తలపెట్టవద్దని ప్రజలకు నష్టం కలిగితే తగిన పరిహారం చెల్లిస్తామని అన్నారు. ఆమెతో రేంజ్ ఆఫీసర్లు వేణుగోపాల్, జీవీ రామకృష్ణ, నజీర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

గిరిజనులలో సహజ సిద్ధమైన బలం

ఉట్నూర్, నవంబర్ 5 ః గిరిజనులలో సహజ సిద్ధమైన క్రీడాబలం ఉంటుందని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ అన్నారు. మంగళవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో ఐదవ రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాలను ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు ప్రకృతిలో జీవిస్తారని అందుకే వారికి సహజ సిద్ధమైన బలం ఉంటుందన్నారు. దానికి తోడ్పాటు అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్రం నుంచి జాతీయ స్థాయిలో 47 మంది క్రీడాకారులు పథకాలు సాధించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ఏజెన్సీలో జాతర్ల, ఉట్నూర్ క్రీడా పాఠశాలల ఏర్పాటుకు కృషి చేశానన్నారు. ఇటీవల జాతీయస్థాయిలో క్రీడలకు సంబంధించిన కమిటీలో తనకు సభ్యత్వం ఉందని దానిని ఉపయోగించుకుని మరిన్ని ఏర్పాట్లు చేసే అవకాశాలు పరిశీలిస్తానన్నారు. క్రీడాకారులు ఉన్నత లక్ష్యాలతో కష్టపడితే విజయాలు సాధిస్తారన్నారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏజెన్సీలో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు అధికారులు ప్రపోజల్స్ పంపాలన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. క్రీడాకారులు ఉద్యోగాలు సాధించేందుకు రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. తాము చదువుకునే సమయంలో తిండికి కష్టంగా ఉండేదని పేర్కొన్నారు. కానీ.. నేటి ప్రభుత్వాలు క్రీడాకారులకు మంచి పౌష్టికాహారంతోపాటు షూ వరకు అందిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సభ్యురాలు ఈశ్వరీబాయి, ఏపీవో వసంత్‌రావు, డీడీ చందన, ఉట్నూర్ డీఎస్పీ నగేందర్ గౌడ్, జిల్లా క్రీడాధికారులు పార్థసారథి, రమేశ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు సాఫీగా జరగాలి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య

సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి, పాల్గొన్న కలెక్టర్లు

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 5 : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లు రాజర్షి షా, అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, శ్యామలాదేవి, అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు, సేకరించిన ధాన్యం, వసతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యానికి మద్దతు ధర, ఇతర వివరాలు తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 287 ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 1.35 లక్షల ఎకరాల్లో ధాన్యం పండించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్, ఆదిలాబాద్ శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

వసతులను కల్పించాలి..

సోన్, నవంబర్ 5 ః ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు. మంగళవారం సోన్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సందర్శించారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

గూగుల్ మీట్ ద్వారా సమీక్ష

ఎదులాపురం, నవంబర్ 5 ః ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా 473 గ్రామ పంచాయతీల పరిధిలో 1,49,161 ఇండ్లు ఉన్నాయి. వీటిని 1612 మంది ఎన్యుమరేటర్లు, 173 మంది సూపర్‌వైజర్లు సర్వే నిర్వహించనున్నారు. బుధవారం కలెక్టర్ రాజర్షి షా తన చాంబర్ నుంచి గూగుల్ మీట్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే మున్సిపల్ పరిధిలోని 48,393 ఇండ్లలో 385 మంది ఎన్యుమరేటర్లు, 41 మంది సూపర్‌వైజర్లు సర్వే నిర్వహించనున్నారని తెలిపారు. పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.

కారుణ్య నియామక కౌన్సెలింగ్

ఎదులాపురం, నవంబర్ 5 ః కారుణ్య నియామకాల కోసం కలెక్టర్ రాజర్షి షా బుధవారం తన చాంబర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగి విధి నిర్వహణలో మరణించిన కుటుంబ వారసులకు కారుణ్య నియామకంలో భాగంగా 19 మందికి ఉద్యోగం కల్పించారు. ఇందులో 8 మందికి జూనియర్ అసిస్టెంట్, 10 మందికి ఆఫీస్ సబార్డినేట్, ఒక్కరికి వాచ్‌మెన్ నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, పరిపాలన అధికారి రాంరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

చికిత్స పొందుతున్న ఫుడ్ పాయిజన్ బాధితులు

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 5 : నిర్మల్ పట్టణంలోని శాస్త్రీనగర్‌లో గల గ్రిల్ నైన్ హోటల్‌లో ఫుడ్‌పాయిజన్ అయిన వారు జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం 13 మంది చేరగా.. సోమవారం కోలుకున్న ఏడుగురిని డిశ్చార్జి చేశారు. ఇంకా ఆరుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. బుధవారం వారికి పూర్తిగా పరీక్షలు చేసి డిశ్చార్జి చేయనున్నట్లు వైద్యులు తెలిపారు.

ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వినియోగించొద్దు

ఎదులాపురం, నవంబర్ 5 : ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వినియోగించరాదని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్ల యాజమానులతో వన్ టౌన్, టూ టౌన్ సీఐలు బి.సునీల్ కుమార్, కరుణాకర్‌రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని గ్రిన్ నైన్ హోటళ్లలో 2వ తేదీన ఆహారాన్ని తిని బోథ్ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు అస్వస్థతకు గురయ్యారన్నారు. వారిలో ఆ పాఠశాలకు చెందిన కుక్ ఫుడ్ పాయిజన్ కావడంతో మంగళవారం మృతి చెందారన్నారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు నిర్మల్‌లోని గ్రీన్ నైన్ యాజమాన్యం, సిబ్బందిపై నమోదు చేశామన్నారు.

ఫుడ్ సేఫ్టీ నియమాలు పాటించాలి..

రెస్టారెంట్లు, హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ నియమాలు పాటించాలని డీఎస్పీ అన్నారు. కుళ్లిన, కాలం చెల్లిన పదార్థాలను వినియోగించరాదని తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన ఫుడ్ కలర్స్‌ను వంటకాల్లో వినియోగించకూడదని సూచించారు. పరిశుభ్రత, స్టాండర్డ్స్‌ను తప్పకుండా పాటించాలని కోరారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్, టూటౌన్ సీఐ కరుణాకర్, ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.